E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 22-03-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:79 || పేజీలు–6

www.ekaburu.com

# గచ్చిబౌలిలో రాక్ స్టార్ ఈవెంట్..



- ప్రైవేటు మ్యూజికల్ ఈవెంట్ కోసం 600 మంది పోలీసులతో బందోబస్తు.. ?
- ఐటీ కారిడార్ వంటి కీలక ప్రాంతంలో 30 వేల పైచిలుకు మందితో ఈవెంట్
- కిక్కిరిసిన రహదారులు - వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- స్టేడియాన్ని క్రీడల కోసమే ఉపయోగిస్తామన్న హామీ ఏమైందంటూ విమర్శలు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

"" శనివారం గచ్చిబౌలి ఐటీ కారిడార్ స్తంభించింది. ఎక్కడ చూసినా ట్రాఫిక్ రద్దీతో ఓవైపు కిక్కిరిసిపోగా.. మరోవైపు అడుగడుగునా పోలీసు పహారాతో కనిపించింది. ఏకంగా 600 మంది పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో భద్రతా చర్యల విధుల్లో పాల్గొన్నారు. ఇంతటి భద్రత కల్పించేందుకు కారణం దేశ రాష్ట్రపతో లేదా విదేశీ అధ్యక్షుడు వచ్చాడనుకుంటే పొరపాటే. ఓ రాక్ స్టార్ మ్యూజిక్ ఈవెంట్ కోసం సైబరాబాద్ పోలీసులు మొత్తం రోడ్లమీదకు వచ్చి భద్రతా చర్యలు చేపట్టడం విస్తు గొలిపింది. ఇంత మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నా సాధారణ వాహనదారునికి మాత్రం ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. గచ్చిబౌలి ఐటీ కారిడార్ రహదారులు మొత్తం వాహనాల రద్దీతో స్తంభించడంతో శనివారం సాయంత్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.""

గచ్చిబౌలి స్టేడియంలో రాక్ స్టార్ ఈవెంట్... ప్రముఖ రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ లైవ్ మ్యూజికల్ ఈవెంట్ ను శనివారం సాయంత్రం గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. ఈ ఈవెంట్ కోసం నిర్వాహకులు భారీ ఎత్తున టికెట్ల అమ్మకాలు చేపట్టారు. ఈవెంట్ కు అభిమానుల నుంచి అదే స్థాయిలో తాకిడి ఉండడంతో గచ్చిబౌలి స్టేడియం పూర్తి సామర్థ్యమైన 30 వేల టికెట్లను విక్రయించినట్లు సమాచారం. పార్కింగ్ సౌకర్యాన్ని టికెట్ రకాన్ని బట్టి వేర్వేరు ప్రాంతాల్లో కేటాయించారు. ఎమ్మార్ బోల్డర్ హిల్స్ లో సిల్వర్ & గోల్డ్ టికెట్ హోల్డర్లకి బైకర్లకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. సంధ్యా కన్వెన్షన్ పార్కింగ్ లో ఫ్యాన్ పిట్ హోల్డర్లు కేవలం కార్లకు మాత్రమే పరిమితం చేశారు.. పార్కింగ్ ప్రదేశం నుంచి పరిమిత సంఖ్యలో షటిల్ సర్వీస్ సౌకర్యం కల్పించారు. గచ్చిబౌలి స్టేడియం పార్కింగ్ లో రాక్ స్టార్ ఫ్యాన్ పిట్ కేటగిరీ వారికి మాత్రమే పార్కింగ్ ఇచ్చారు. దీని కారణంగా ఈవెంట్ కు వచ్చిన సందర్శకుల రాకపోకలు, వాహనాలతో శనివారం సాయంత్రం గచ్చిబౌలి ఐటీ కారిడార్ రహదారులు కిక్కిరిసిపోయాయి .ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మిగతా 3లో

# ఇరాన్ దూకుడు..



- ఒకటి విఫలం, మరోటి కూల్చివేత?
- యుద్ధంపై అమెరికా, ఇజ్రాయెల్ చెరో మాట
- ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు
- డిగో గార్సియాపైకి క్షిపణులు ప్రయోగించిన టెహ్రాన్
- ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా
- హర్మూజ్‌ను తెరవండి.. 22 దేశాల విజ్ఞప్తి

**ఈ-కబురు, దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం చల్లారట్లేదు. ఓ వైపు అమెరికా-ఇజ్రాయెల్ విరుచుకుపడుతుంటే.. ఇరాన్ అంతే స్థాయిలో ప్రతిఘటిస్తోంది. శనివారం.. తమ దేశానికి దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రిటన్-అమెరికా సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి పాశ్చాత్య దేశాల్ని కలవరపాటుకు గురిచేసింది. ఈ దాడి యత్నం ద్వారా సుదీర్ఘ దూరంలోని లక్ష్యాలనూ ఢీ కొట్టగలమన్న సంకేతాన్ని పంపింది. మరోవైపు ఇరాన్‌లోని కీలక అణుశుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై శనివారం అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఈ కేంద్రంపై గతేడాది జరిగిన 12 రోజుల యుద్ధంలోనూ అమెరికా తీవ్రస్థాయిలో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడులు.. ప్రతిదాడుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. యుద్ధాన్ని ముగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము చేపట్టిన సైనిక చర్యలు అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాయని చెప్పారు.**

ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే.. వచ్చే వారం ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడతామంటూ ఇజ్రాయెల్ భిన్నమైన ప్రకటన చేయడం గమనార్హం. ''ఇరాన్‌పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనాయంత్రాంగాన్ని, కమాండర్లను, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు'' అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు. ముడి చమురు ధరల నియంత్రణపై దృష్టిపెట్టిన ట్రంప్ యంత్రాంగం ఇరాన్ చమురు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ చమురుపై గతంలో విధించిన ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.


**మరోసారి నతాంజ్‌పై..**

నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయని ఇరాన్ శనివారం ప్రకటించింది. అయితే అణుకేంద్రం నుంచి ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని పేర్కొంది. దాడి సమాచారాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అందించినట్లు పేర్కొంది. అయితే తాము దాడి చేయలేదని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అమెరికా చేసిందా లేదా అన్న విషయంపై స్పష్టతివ్వలేదు. నతాంజ్‌పై ఈ నెల తొలివారంలోనూ దాడి జరిగింది. ఈ అణుకేంద్రంపై దాడిని రష్యా ఖండించింది. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. క్షిపణి సామర్థ్యాలను నాశనం చేశాం ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ పోస్టు పెట్టారు. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నౌకా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారు చేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు.

మిగతా 2లో

శ్రమ ఫలితం మాదైతే...

# శిలాఫలకాలు మీవా?



**మాజీ మంత్రి హరీశ్‌రావు**

ఈకబురు,హైదరాబాద్: సిద్దిపేట టౌన్, : ఆయిల్‌పామ్ అంటేనే తెలియని ఈ ప్రాంత రైతులకు సాగుపై అవగాహన కల్పించి 12 వేల ఎకరాల్లో సాగు చేయించామని, ఆ ఘనత తమకే దక్కుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.

మిగతా 2లో

మావోలకు 'డెడ్'లైన్..

# మరో పది రోజులే!



- మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశంగా చేస్తామని ఇప్పటికే అమిత్‌షా ప్రకటన
- డెడ్‌లైన్ పొడిగింపు ఉండబోదని పలుమార్లు స్పష్టీకరణ

03

# భక్తుల నమ్మకాన్ని కాపాడాలి

## .. నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలి

03



ఈ కబురు :- భక్తుల నమ్మకానికి చిన్నపాటి విఘాతం కూడా కలిగించకూడదని.. వారి నమ్మకాన్ని కాపాడేలా నిరంతరం కృషి చేస్తూనే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని, తాగునీటిని అందించేందుకు టెక్నాలజీని వినియోగిస్తూ చిత్తశుద్ధితో పని చేయాలని సీఎం సూచించారు.




## రాష్ట్రాలకు ఎల్పీజీ కేటాయింపు పెంపు

ఈ-కబురు, : వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది.

02

- పార్టీ సీనియర్లు, న్యాయనిపుణులతో కేటీఆర్ చర్చ
- బిల్లు ఆమోదానికి ఒత్తిడి తేవాలని పార్టీలకు వినతి
- శుక్రవారం ఉభయ సభల్లో పెట్టేందుకు సన్నాహాలు



# ఆరు గ్యారంటీల అమలుకు 'ప్రైవేటు' బిల్లు



**ఈ-కబురు,హైదరాబాద్:**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీ ఉభయ సభల్లో ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. పార్టీ సీనియర్ నేతలు, న్యాయ నిపుణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శనివారం తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు.

02



# స్వతంత్ర హోదాలో

## మాపై దురాక్రమణను అడ్డుకోండి

**తనకు ఫోన్ చేసిన మోదీతో ఇరాన్ అధ్యక్షుడు**

ఈకబురు,దిల్లీ: బ్రిక్స్ కూటమికి ప్రస్తుతం సారథ్యం వహిస్తున్న భారత్.. ఆ హోదాలో స్వతంత్రపాత్ర పోషించి ఇరాన్‌పై దురాక్రమణల్ని అడ్డుకునే చర్యలు చేపట్టాలని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కోరారు. "విదేశీ జోక్యం లేకుండా" పశ్చిమాసియా దేశాలు ఒక ప్రాంతీయ భద్రత వ్యవస్థగా ఏర్పడాలని ప్రతిపాదించారు. పెజెష్కియాన్‌తో భారత ప్రధాని మోదీ శనివారం ఫోన్లో మాట్లాడారు. అణ్వాయుధాలు సమీకరించుకోకుండా అడ్డుకునేందుకే తమపై సైనిక దాడికి దిగినట్లు అమెరికా చెప్పడాన్ని ఇరాన్ అధ్యక్షుడు ఖండించారు.

మిగతా 2లో

# నేడు రైతు భరోసా నిధుల విడుదల

- రేపు రైతుల ఖాతాల్లో జమ
- తొలివిడతలో ఎకరం వరకు సాయం
- నేడు నర్మెట ఆయిల్‌పామ్ కర్మాగారానికి సీఎం ప్రారంభోత్సవం

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతుభరోసా నిధులను ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ఈ పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చుకుంది. సిద్దిపేట జిల్లా నర్మెటలో సాయంత్రం 4గంటలకు జరిగే సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయ మంత్రి తుమ్మల, ఇతర మంత్రుల సమక్షంలో సీఎం వీటిని విడుదల చేస్తారు. తెలంగాణలో మొత్తం 73 లక్షల మంది రైతులున్నారు.

02





# 3 దశల్లో భద్రాచలం ఆలయాభివృద్ధి

మంత్రులు, అధికారులతో

## సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

ఈకబురు,హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు

మిగతా 2లో

ద్రవ్యోల్బణం తరముకొస్తున్నా

# మోదీ సర్కార్ డొల్ల మాటలు

**రాహుల్ గాంధీ ధ్వజం**

**ఈ-కబురు,దిల్లీ:** పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో రూపాయి విలువ పడిపోవడం, పారిశ్రామిక ఇంధన ధరలు పెరగడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు.



02

# 3 దశల్లో భద్రాచలం ఆలయాభివృద్ధి



వచ్చే ఏడాది మార్చి 31 నాటికి తొలిదశ పనులు పూర్తిచేసే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయాభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. ఆయన శనివారం తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అధికారులతో సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి.. అంచనాలతో తొలిదశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి ఉండాలన్నారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా పూర్తిగా ఆగమశాస్త్రానుసారం పనులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శులు శేషాద్రి, శ్రీనివాస రాజు, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ సంస్థ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, ఆలయ ఈఓ, పూజారులు పాల్గొన్నారు.

### శ్రమ ఫలితం మాదైతే...

# శిలాఫలకాలు మీవా?



నర్మెటలో నిర్మించిన ఆయిల్‌పామ్ కర్మాగారం ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రికి శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. లేఖను సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో విడుదల చేసి మాట్లాడారు. ''నర్మెటలోని ఫ్యాక్టరీలో 20 కోట్ల లీటర్ల నీటి పాండ్‌ను ఏర్పాటు చేశాం. ఇదంతా కూడా కాళేశ్వరం జలాలతోనే సాధ్యమైంది. 2021లోనే పరిశ్రమకు 62 ఎకరాలు, నిర్మాణానికి రూ.300 కోట్లు మంజూరు చేశాం. కాళేశ్వరం కూలిందన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ఆ పరిశ్రమను ప్రారంభిస్తున్నారు. కాళేశ్వరం తెలంగాణకు వరం. ముఖ్యమంత్రి ఆ నీటిని నెత్తిన చల్లుకుని పాప పరిహారం చేసుకోవాలి. మా ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూసినా... మొక్కవోని దీక్షతో పూర్తి చేశాం. నేను ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నపుడే సిద్దిపేటలో రూ.3.60 కోట్లతో సెంట్రల్ డ్రగ్‌స్టోర్, రూ.25 కోట్లతో ఆయుష్ ఆసుపత్రి, నంగునూరు మండలం గట్లమల్యాలలో రూ.1.43 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిద్దిపేటలో రూ.1.43 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇవన్నీ మంజూరు చేసి పూర్తి చేశాం. వాటికే మీరు శిలాఫలకాలు వేసుకుని ప్రారంభిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మా హయాంలో పూర్తయిన అభివృద్ధి పనులకే రిబ్బన్ కట్ చేస్తున్నారు. శ్రమ ఫలితం మాదైతే.. శిలాఫలకాలు మీవా'' అని ప్రశ్నించారు. 'సిద్దిపేట శివారులోని ఎన్సాన్‌పల్లిలో భారాస హయాంలో రూ.78 కోట్లతో జిల్లా కారాగారం నిర్మించాం. ఎంతో వ్యయప్రయాసలకోర్చి 30 ఎకరాల భూసేకరణ చేసి అత్యున్నత ప్రమాణాలతో నిర్మించాం. కట్టించింది మేమైతే శిలాఫలకం మీదా? ఇప్పటికీ సిద్దిపేట నియోజకవర్గంలో 22,819 (52 శాతం) మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రూ.300 కోట్ల రుణమాఫీ బకాయి పడ్డారు. ఒక్క నర్మెటలోనే 350 మందికి రుణమాఫీ కాలేదు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటలో అడుగుపెడుతున్నారు? రైతుబంధు ఇస్తామనడం సంతోషమే. కానీ రెండేళ్ల నుంచి మూడు పంటలకు ఎగ్గొట్టారు కదా.. దాని సంగతేంటి? సిద్దిపేటలో రద్దు చేసిన రూ.1,070 కోట్ల అభివృద్ధి పనులను వెంటనే పునరుద్ధరించాలి' అని డిమాండు చేశారు.

### స్వతంత్ర హోదాలో మాపై

# దురాక్రమణను అడ్డుకోండి



దివంగత సుప్రీంనేత ఖమేనీ ఈ ఆయుధాలను తీవ్రంగా వ్యతిరేకించారని, వాటి అభివృద్ధికి ఎలాంటి ముందడుగు వేయకూడదంటూ పాలనపరమైన, మతపరమైన ఆదేశాలు జారీచేశారని ఆయన చెప్పినట్లు టెహ్రాన్‌లో ఇరాన్ విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది. పశ్చిమాసియాలో కీలక మౌలిక సదుపాయాలపై దాడుల్ని మోదీ ఖండించారు. నౌకాయాన స్వేచ్ఛను కాపాడాలని, ఆయా మార్గాలు సురక్షితంగా.. తెరచి ఉండేలా చూడాలని నొక్కిచెప్పారు. తొలుత రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపి, ఈ పండుగ సమయం పశ్చిమాసియా ప్రాంతానికి శాంతిసుస్థిరతను, సుసంపన్నతను తీసుకురావాలని ఆకాంక్షించారు.

### ద్రవ్యోల్బణం తరముకొస్తున్నా

# మోదీ సర్కార్ డొల్ల మాటలు

భవిష్యత్తులో భారత్‌లో ద్రవ్యోల్బణం ఖాయమని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్పష్టమైన ఆర్థిక వ్యూహానికి బదులుగా డొల్ల మాటలు చెబుతోందని విమర్శించారు. శుక్రవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 93 మార్కు కంటే దిగువకు పడిపోయిన నేపథ్యంలో రాహుల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ''డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడి రూ.100 వైపు పయనించడం, పారిశ్రామిక ఇంధన ధరలు విపరీతంగా పెరగడం ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు. రాబోయే ద్రవ్యోల్బణానికి స్పష్టమైన సంకేతాలు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత స్టాక్ మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. మోదీ ప్రభుత్వం దీనిని సాధారణం(నార్మల్) అని పిలవొచ్చు. కానీ వాస్తవం ఏంటంటే ఉత్పత్తి, రవాణా మరింత ఖరీదైనవిగా మారుతాయి. ఎంఎస్‌ఎంఈలు అత్యంత తీవ్రంగా దెబ్బతింటాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఎఫ్‌ఐఐల డబ్బు మరింత వేగంగా బయటకు తరలిపోతుంది. ఇది స్టాక్ మార్కెట్‌పై మరింత ఒత్తిడిని పెంచుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఇది ప్రతి కుటుంబంలోని వ్యక్తి జేబుపై ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావం చూపడం ఖాయం. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు కూడా పెరుగుతాయి'' అని రాహుల్ రాసుకొచ్చారు. ద్రవ్యోల్బణం తరముకొస్తున్నామోదీ సర్కార్ డొల్ల మాటలు

# ఇరాన్ దూకుడు..



**ఆంక్షల ఎత్తివేత తాత్కాలికమే**

ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్న అమెరికా ఆ దేశ చమురుపై తాత్కాలికంగా ఆంక్షలను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 19 వరకు ఇరాన్ చమురును ఏ దేశమైనా దిగుమతి చేసుకోవచ్చని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ఇప్పటికే నౌకల్లో ఉన్న ఇరాన్ చమురుకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని స్పష్టంచేశారు. యుద్ధం కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరలను నియంత్రించడానికి అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ నేపథ్యంలోనే ఇటీవల రష్యా చమురుపైనా ఆంక్షలు తాత్కాలికంగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. అమెరికా నిర్ణయంపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు చమురు లేదని స్పష్టం చేసింది. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకు, కొనుగోలుదారులకు భరోసా ఇవ్వడం కోసం అమెరికా ఈ ప్రకటన చేసిందని ఆరోపించింది.

**టెహ్రాన్, బీరుట్ పై ఇజ్రాయెల్ దాడులు**

ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌లపై శనివారం ఇజ్రాయెల్ దాడులు నిర్వహించింది. సెంట్రల్ బీరుట్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 1000 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 లక్షల మందికి పైగా పౌరులు నిరాశ్రయులయ్యారు.

ఇజ్రాయెల్ తమ నిఘా కేంద్ర కార్యాలయంపై దాడి చేసి ఓ అధికారిని హతమార్చిందని ఇరాన్ పేర్కొంది.

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు శనివారమూ కొనసాగాయి. టెహ్రాన్ క్షిపణి దాడిలో చిన్నపిల్లల పాఠశాల భవనమొకటి దెబ్బతిందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించింది.

ఇజ్రాయెల్‌లోని దిమోనాపై ఇరాన్ శనివారం సాయంత్రం జరిపిన క్షిపణి దాడిలో 21 మంది గాయపడ్డారు. ఇరాన్ క్షిపణి నేరుగా ఓ భవంతిని తాకడంతో అది ధ్వంసమైంది.

బహ్రెయిన్ రాజధాని మనామాపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించినట్లు తెలుస్తోంది. మనామాలో బాంబుల శబ్దాలు వినిపించాయని స్థానికులు పేర్కొన్నారు.

ఇరాన్ ప్రయోగించిన మూడు బాలిస్టిక్ క్షిపణులను, 8 డ్రోన్లను అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది.

తమ చమురు క్షేత్రాలపైకి దూసుకొస్తున్న 20 డ్రోన్లను కూల్చినట్లు సౌదీ పేర్కొంది.

కొత్త సంవత్సర పండగైన నౌరోజ్ వేడుకలు జరుపుకొంటున్న ఇరానియన్లకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న తీవ్రమైన పరీక్షలను ఇరాన్ గౌరవప్రదంగా అధిగమిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఇరాన్‌కు నమ్మకమైన స్నేహితుడిగా, విశ్వసనీయమైన భాగస్వామిగా మాస్కో ఉంటుందని తెలిపారు.

హర్మూజ్ జలసంధిపై దాడులు ఆపాలని బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, బహ్రెయిన్, యూఏఈ సహా 22 దేశాలు ఇరాన్‌కు శనివారం సూచించాయి. ప్రపంచ చమురు, సహజవాయువు సరఫరాలకు కీలకమైన ఈ జలసంధిని తెరవాలని విజ్ఞప్తి చేశాయి.

**లక్ష్యాన్ని చేరుకోని క్షిపణులు**

హిందూ మహా సముద్రంలోని బ్రిటన్‌అమెరికా సంయుక్త సైనిక స్థావరమైన డిగో గార్సియాపై ఇరాన్ రెండు మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. ఈ స్థావరం.. ఇరాన్‌కు దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు లక్ష్యాన్ని చేరలేదని సమాచారం. ఒక క్షిపణి మార్గం మధ్యలోనే విఫలమైంది. మరొకదాన్ని అమెరికా అడ్డుకుందని తెలుస్తోంది. ఈ దాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. ''పశ్చిమాసియా వ్యాప్తంగా దాడులు చేయడం, హర్మూజ్ జలసంధిని మూసివేయడం.. బ్రిటన్ ప్రయోజనాలకు, మా మిత్రులకు ముప్పు'' అని బ్రిటన్ రక్షణ శాఖ పేర్కొంది. డిగో గార్సియాపై దాడి వివరాలను మాత్రం బ్రిటన్ అధికారులు వెల్లడించలేదు.

యూఎస్ బాంబర్లు.. ఇరాన్‌పై దాడి చేయడానికి తమ వైమానిక స్థావరాలను వినియోగించుకోవచ్చని బ్రిటన్ శుక్రవారం తెలిపింది. దీనిపై ట్రంప్ స్పందించారు. బ్రిటన్ ఈ నిర్ణయాన్ని ఇంకా వేగంగా తీసుకోవాల్సిందని అన్నారు. బ్రిటన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా స్పందించారు. బ్రిటన్ ప్రభుత్వం తన సొంత ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా అమెరికాఇజ్రాయెల్ యుద్ధంలో భాగస్వామి అవుతోందని ఆయన విమర్శించారు. దీని వల్ల బ్రిటన్ ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు.

# నేడు రైతు భరోసా నిధుల విడుదల



వీరందరికీ ఒక ఎకరం వరకు సాయం అందేలా రూ.3,590 కోట్లు ఆదివారం ఆర్బీఐ ద్వారా బ్యాంకులకు అటు నుంచి రైతులకు చేరతాయి. ఆదివారం సెలవు కావడంతో సోమవారం అన్నదాతల ఖాతాల్లో జమవుతాయి. ఇరవై రోజుల అనంతరం రెండో విడతలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లు విడుదల చేస్తారు. రాష్ట్రంలోని మొత్తం రైతుల్లో 24.32 లక్షల మందికి ఎకరం వరకు, 48.68 లక్షల మందికి ఎకరం కంటే ఎక్కువ వ్యవసాయ భూములు ఉన్నాయి.

**నేడు నర్మెటకు సీఎం రేవంత్‌రెడ్డి**

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ పంటకు కొత్త శకం ప్రారంభంకానుంది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌పామ్ కర్మాగారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభంకానుంది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, అప్పారావుపేటలో ఆయిల్‌పామ్ కర్మాగారాలు ఉండగా.. ఇది మూడోది. ఆయిల్‌పామ్ గెలలను కొనేందుకు ప్రస్తుతం అశ్వారావుపేట, అప్పారావుపేట పరిశ్రమలే ఉన్నాయి. ఇది రైతులకు రవాణాపరంగా భారంగా మారింది. ఈ తరుణంలో నర్మెట కర్మాగారం అందుబాటులోకి రానుండటంతో సిద్దిపేటతోపాటు ఉత్తర, దక్షిణ తెలంగాణలోని 18 జిల్లాల రైతులకు మేలు జరగనుంది. అధునాతన సాంకేతికతతో నిర్మించిన ఈ పరిశ్రమలో రూ.80 కోట్లతో రిఫైనరీని సైతం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇది సిద్ధమైతే స్థానికంగానే పామాయిల్‌ను ఉత్పత్తి చేయొచ్చు. రాష్ట్రంలో మరో ఆరు కర్మాగారాల నిర్మాణం వడివడిగా సాగుతోంది. ఖమ్మం జిల్లా కల్లూరుగూడెం, కొణిజర్ల, గద్వాల జిల్లా బీచుపల్లి, ములుగు జిల్లా ఇంచర్ల, పెద్దపల్లి జిల్లా పెద్దరాత్‌పతి, వనపర్తి జిల్లా సంకిరెడ్డిపల్లిలో ఈ సంవత్సరాంతానికి అవి అందుబాటులోకి రానున్నాయి.

**పంటల మార్పిడికి 'బోనస్'!**

పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు వీలుగా రాష్ట్రంలో కొరత, డిమాండ్ ఉన్న పంటలకు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదివారం నర్మెటలో జరిగే రైతు ఉత్సవాల్లో కొత్త పంటలకు బోనస్‌పై విధాన నిర్ణయం ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రతియేటా రెండు సీజన్లలో 30 రకాల పంటలను 2.14 కోట్ల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో 1.28 కోట్ల ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి ప్రధాన పంటలుగా వేస్తారు. తర్వాత స్థానాల్లో మొక్కజొన్న, కందులు, సోయాబీన్ ఉన్నాయి. ప్రభుత్వం రెండేళ్లుగా సన్నవడ్లకు ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తోంది. దీనికి 202526 బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు ఇచ్చింది. ఆయిల్‌పామ్‌తోపాటు ఇతర నూనెగింజలు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న, వేరుసెనగ, పసుపు పంటలకు సైతం బోనస్ ఇవ్వాలని డిమాండ్లు పెరగడంతో ప్రభుత్వం దానిపై దృష్టి సారించినట్లు సమాచారం. అందులో భాగంగానే 202627 బడ్జెట్‌లో పంటల బోనస్‌కు మొత్తంగా రూ.3,500 కోట్లను కేటాయించినట్లు తెలుస్తోంది.

# ఆరు గ్యారంటీల అమలుకు 'ప్రైవేటు' బిల్లు



. న్యాయవాదులుగానూ అనుభవం ఉన్న పార్టీ నేతలు మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌తోపాటు మాజీ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, న్యాయవాది మోహన్‌రావు ఈ భేటీలో పాల్గొన్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశ పెట్టడంలో ఉన్న సాధ్యాసాధ్యాలు, విధి విధానాలపై చర్చించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని వారి చాంబర్‌లో కలిసి తాము ప్రవేశపెడుతున్న ప్రైవేటు బిల్లును అనుమతించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోరనున్నారు. వచ్చే శుక్రవారం ఉభయ సభల్లో ప్రవేశ పెట్టేందుకు బీఆర్‌ఎస్ సన్నాహాలు ప్రారంభించింది.

ప్రైవేటు బిల్లును ప్రవేశ పెట్టిన తర్వాత అన్ని పార్టీల నేతలను కలిసి మద్దతు కోరడంతోపాటు ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బిల్లు కాపీలు ఇస్తారు. బిల్లుకు మద్దతు కోరుతూ అవసరమైతే అన్ని రాజకీయ పక్షాలకు లేఖలు కూడా రాయాలని శనివారం జరిగిన భేటీలో నిర్ణయించారు. అనంతరం కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

**పార్టీలకు అతీతంగా బిల్లు కోసం ఒత్తిడి**

'బీఆర్‌ఎస్ పెట్టే ప్రైవేటు బిల్లుకు మద్దతిచ్చేందుకు పార్టీలకు అతీతంగా తెలంగాణ బిడ్డలందరూ స్థానిక ఎమ్మెల్యేలపై ఒత్తిడి తేవాలి. ఆరు గ్యారంటీల ద్వారా లబ్ధిదారులకు అందే డబ్బును నేరుగా వారి ఖాతాల్లోనే వేసేలా ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నాం. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తొలి రోజునే సీఎం రేవంత్ ఆరు గ్యారంటీల ఫైలుపై సంతకం చేశారు. గవర్నర్ నోటితో అసెంబ్లీ సంయుక్త సమావేశంలో చెప్పించి 840 రోజులు కావస్తున్నా వాటి ఊసేలేదు. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో 1986లో బీజేపీ ఫ్లోర్ లీడర్ సీహెచ్ విద్యాసాగర్ రావు ప్రవేశపెట్టిన ప్రైవేటు మెంబర్ బిల్లును ఆమోదించిన చరిత్ర ఉంది. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే మేము ప్రవేశపెడుతున్న ప్రైవేటు మెంబర్ బిల్లును చర్చకు అనుమతించి ఆమోదించాలి. రాష్ట్రంలోని రైతులు, మహిళలు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులు యువకులు సహా అన్ని వర్గాల తరపున ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నాం. అభయహస్తం మేనిఫెస్టోను వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మేము ప్రవేశపెట్టే బిల్లుకు అధికార పక్షం కూడా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నాం'అని కేటీఆర్ అన్నారు.

**తొలి సంతకం ఫైల్‌ను పోగొట్టుకున్నారా?**

'అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలు కోసం సీఎం తొలి సంతకం చేసిన ఫైలు కనిపించడం లేదా? లేకపోతే తరచూ విమాన ప్రయాణాలు చేస్తున్న సీఎం ఆ ఫైలును పోగొట్టుకున్నారా? ఎందుకంటే ఇప్పటివరకు మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఆరు గ్యారంటీల ఊసే లేదు. ఈ ప్రభుత్వానికి వచ్చే ఏడాది మాత్రమే సంపూర్ణ బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంది.

కాబట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రైవేటు బిల్లు పెట్టడం మినహా మరో మార్గం కనిపించడం లేదు. ఈ బిల్లుకు చట్టబద్ధత వస్తే రైతు భరోసా సహా ఇతర హామీలు ఎగవేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉండదు. ఈ బిల్లును శాసనసభలో అనుమతించకుంటే చట్టపరంగా ఉన్న ఇతర మార్గాలను కూడా బీఆర్‌ఎస్ ఉపయోగించుకుంటుంది'అని కేటీఆర్ వెల్లడించారు.



# రాష్ట్రాలకు ఎల్పీజీ కేటాయింపు పెంపు

**ఈ-కబురు, : వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.**

# గచ్చిబౌలిలో రాక్ స్టార్ ఈవెంట్...


గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈవెంట్లో ప్రేక్షకుల కేరింతలు


గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈవెంట్లో ప్రేక్షకుల కేరింతలు


ఈవెంట్ కారణంగా ఐటీ కారిడార్ లో స్తంభించిన ట్రాఫిక్


ఈవెంట్ కారణంగా ఐటీ కారిడార్ లో స్తంభించిన ట్రాఫిక్

**600 మంది సిబ్బందితో భద్రత... ?**

కాగా ప్రైవేటు మ్యూజికల్ ఈవెంట్ కోసం సైబరాబాద్ పోలీసులు 600 మంది సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారనే విషయం ఆశ్చర్యాన్ని కలిగించింది. చుట్టుపక్కల పోలీస్ స్టేషన్ల పరిధిలోని సిబ్బంది మొత్తం శనివారం సాయంత్రం ఈవెంట్ కోసమే తమ సమయాన్ని వెచ్చించాలని తెలుస్తుంది. ప్రైవేటు ఈవెంట్లకు నిర్వాహకులే ప్రైవేటు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉండగా, ఈ ఈవెంట్ కు మాత్రం పోలీసులపైనే భారం మోపడం విశేషం.

ఐటీ కారిడార్ వంటి కీలకమైన, సునిశితమైన ప్రాంతంలో దాదాపు 30 వేల మంది పాల్గొనే ఈవెంట్ కు అనుమతి ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. స్టేడియంకు కిలోమీటర్, రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలను వాహనాల పార్కింగ్ కు కేటాయించడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈవెంట్ కు వచ్చిన వాహనాలతో పాటు సాధారణ ప్రయాణికుల వాహనాలతో ఐటీ కారిడార్ స్తంభించిపోయింది.

**క్రీడల కోసమే ఉపయోగిస్తామన్న హామీ ఏమైంది...**

కాగా గచ్చిబౌలి స్టేడియంను కేవలం క్రీడా కార్యక్రమాలకే ఉపయోగిస్తామని గతంలో ముఖ్యమంత్రి, అధికారులు చేసిన ప్రకటనలు ఏమయ్యాయి అంటూ పలువురు విమర్శిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియం సామర్థ్యానికి మించి ఈవెంట్ కోసం టిక్కెట్ల అమ్మకాలు చేపట్టడంతో వేలకొద్దీ ప్రేక్షకులు తరలివచ్చారు. ప్రధాన స్టేడియం రన్నింగ్ ట్రాక్ పైనే ఈవెంట్ నిర్వహించడంతో ట్రాక్ ధ్వంసం అవుతుందంటూ క్రీడా ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్యే 100 కోట్ల పైచిలుకు వ్యయంతో మెరుగులు దిద్దిన గచ్చిబౌలి స్టేడియం ఇటువంటి కార్యక్రమాల కారణంగా అధ్వాన్నంగా మారుతుందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గచ్చిబౌలి స్టేడియాన్ని క్రీడా కార్యక్రమాల కోసమే ఉపయోగించాలని కోరుతున్నారు.



# భక్తుల నమ్మకాన్ని కాపాడాలి

కలియుగ వైకుంఠం తిరుమలకు వచ్చే కోట్లాది మంది భక్తుల నమ్మకం, విశ్వాసాలను మరింత పెంచేలా... ఆరోగ్య భద్రతే ధ్యేయంగా టీటీడీ మరో చారిత్రాత్మక అడుగు వేసింది. స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, FSSAI సంయుక్తంగా టీటీడీ సహకారంతో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక వాటర్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించారు. దేశంలోనే ఒక ఆలయం కోసం ఏర్పాటు చేసిన మొట్టమొదటి అత్యున్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్ ఇదే కావడం విశేషమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ల్యాబ్ ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి ల్యాబ్ లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్ పనితీరు, సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల నాణ్యతను ఏ స్థాయిలో విశ్లేషించవచ్చని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కెమికల్, మైక్రోబయాలజీ విభాగాలుగా దీనిని నిర్మించామని, ఇందులో etongue, enose వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇవి ఆహార పదార్థాల రుచి, వాసనను డిజిటల్ పద్ధతిలో ఖచ్చితంగా విశ్లేషించగలవని అధికారులు సీఎంకు వివరించారు. 1981లో నీటి పరీక్షల కోసం చిన్నదిగా ప్రారంభమైన ఈ విభాగం, ఇప్పుడు నెలకు 1,000 నుండి 1,500 శాంపిళ్లను విశ్లేషించే స్థాయికి చేరడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

**–కల్తీ నివారణే లక్ష్యం : సీఎం ఆదేశాలు**

శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి, ఇతర పదార్థాల కల్తీ నివారణకు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కల్తీ జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు. 2024 నవంబరులో NDDB సంస్థ విరాళంగా అందించిన ఆధునిక GC/HPLC యంత్రాల ద్వారా నెయ్యి స్వచ్ఛతను అత్యంత శాస్త్రీయంగా ఇక్కడే నిర్ధారించవచ్చని అధికారులు వెల్లడించారు. 2025 జూలై నుంచి నెయ్యి నాణ్యతపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, దీనివల్ల కల్తీకి ఏమాత్రం అవకాశం ఉండదని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ముడి పదార్థాల్లో ఉండగలిగే పురుగు మందుల అవశేషాలు, యాంటీ బయోటిక్స్, లెడ్, ఆర్సినిక్ వంటి హెవీ మెటల్స్ కనుగొనే సామర్థ్యం ఉన్న పరికరాలను కూడా ఈ ల్యాబులో ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

**–తిరుమలలో ల్యాబ్ దేశానికే ఆదర్శం**

బ్యాక్టీరియా గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్లీన్ రూమ్, ఎయిర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ వంటి భద్రతా ప్రమాణాలను చూసి ముఖ్యమంత్రి అభినందించారు. శ్రీవారి ప్రసాదాల పట్ల భక్తులకు ఉన్న అపారమైన నమ్మకాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. కేవలం ల్యాబ్ పరీక్షలకే పరిమితం కాకుండా, అన్నప్రసాద కేంద్రాల్లోని వంటశాలల శుభ్రతపై నిరంతర తనిఖీలు నిర్వహించి పరిశుభ్రతను నిర్ధారించాలని ఆదేశించారు. టీటీడీ తీసుకున్న ఈ చర్యలు శ్రీవారి ప్రసాదాల పట్ల మరింత నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భక్తుల ఆరోగ్య రక్షణకు మాత్రమే కాకుండా, తిరుమలలో చేపట్టిన ఫుడ్ సేఫ్టీ చర్యలు దేశానికే ఒక ఆదర్శంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, టీటీడీ పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ఫుడ్ - సేఫ్టీ ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# వచ్చే నెలలో రాష్ట్రానికి ప్రధాని మోదీ?



ఈ కబురు హైదరాబాద్: కేంద్రం నిధులతో రాష్ట్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టేందుకు ప్రధాని మోదీ ఏప్రిల్ మొదటి వారంలో హైదరాబాద్ రానున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా నగరంలో భారీ బహిరంగ సభకు హాజరై.. అక్కడి నుంచే వర్చువల్‌గా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారని సమాచారం. వరంగల్‌లో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బీబీనగర్ ఎయిమ్స్‌లో కొత్తగా నిర్మించిన పలు బ్లాకులు, పలు జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలతోపాటు హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ప్రతిపాదిత ఎంఎంటీఎస్ రైల్వే ప్రాజెక్టు, ప్రాంతీయ వలయ రహదారి(ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి శంకుస్థాపన చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ రాష్ట్రానికి తొలిసారి రానున్నారని, ఈ సందర్భంగా భాజపా తరపున ఘనస్వాగతం పలకాలని శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన పార్టీ నేతల సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. ప్రధాని అధికారిక పర్యటన షెడ్యూలుపై త్వరలో స్పష్టత రానుందని సమాచారం.

# మావోలకు 'డెడ్'లైన్.. మరో పది రోజులే!



ఈకబురు,హైదరాబాద్: 'మార్చి 31 నాటికి భారత దేశాన్ని మావోయిస్టు రహిత దేశంగా మారుస్తాం'గత రెండేళ్లుగా పలు వేదికలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేస్తున్న ప్రకటన ఇది. తాజాగా ఈ నెల 6న ఒడిశాలోని కటక్ జిల్లా ముందలిలో జరిగిన సీఐఎస్ఎఫ్ 57వ ఆవిర్భావ దినోత్సవంలోనూ 'తిరుపతి నుంచి నేపాల్‌లోని పశుపతినాథ్ వరకు రెడ్ కారిడార్ నిర్మించాలని కలలు కనే శక్తులను మన భద్రత దళాలు కచ్చితంగా ఓడిస్తాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజం అంతం కావడమే లక్ష్యం'అంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మార్చి 31 లోపు అజ్ఞాతం వీడి లొంగిపోని మావోయిస్టుల పట్ల కఠిన వైఖరే అని కూడా అమిత్ షా సుస్పష్టంగా చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం..ఈనెల 31న మావోయిస్టులకు 'డెడ్'లైన్ పూర్తవుతుంది, మరో పదిరోజులే గడువు ఉంది, అయితే ప్రభుత్వాలు చెబుతున్నట్టు మార్చి 31 తర్వాత మావోయిస్టులు లేని భారత్ సాధ్యమేనా..?

మరోవైపు పౌరహక్కుల నేతలు, మాజీ మావోయిస్టులు, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు చెబుతున్నట్లుగా డెడ్‌లైన్‌లు పెట్టి సిద్ధాంతాలు అంతం చేయలేరన్న వాదనలు గెలుస్తాయా..? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠగా మారింది. ఇంకా మావోయిస్టులలో వందలాది మంది సాయుధులు ఉన్నారని, మావోయిస్టులను అంతం చేయడం ప్రభుత్వాలు అనుకున్నంత సులువేంకాదని ఇటీవల జనజీవనస్రవంతిలోకి వచ్చిన కేంద్ర కమిటీ సభ్యుడు ఒకరు ధీమా వ్యక్తం చేశారు.

ఆ ఏడుగురు తిరిగొచ్చేనా...?

మావోయిస్టుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు 2023లో 125 మంది ఉండగా..ప్రస్తుతం ఆ సంఖ్య ఏడుకు పరిమితమైందని పోలీసులు అధికారికంగా ప్రకటించారు. కేంద్ర కమిటీ సభ్యులు దేవ్‌జీ అలియాస్ టిపిరి తిరుపతి, మల్లరాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, చంద్రన్న సహా ఎంతో మంది కీలక నేతలు నెలల వ్యవధిలోనే లొంగుబాట పట్టారు. అయితే తాము అరెస్టు అయ్యామని చెబుతున్నా..పోలీసులు సరెండర్ చూపినా..ఫలితం మాత్రం ఆయుధాన్ని వీడి జనజీవనస్రవంతిలోకి వచ్చారు. 2024 నుంచి తెలంగాణ పోలీసుల ఎదుట 721 మంది లొంగిపోవడంతోపాటు 266 ఆయుధాలను అప్పగించారు. తెలంగాణకు చెందిన ఏడుగురు మావోయిస్టులు ఇంకా యాక్టివ్‌గా ఉన్నట్టు తెలంగాణ పోలీసులు ప్రకటించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, గణపతి భార్య జోడే రత్నాబాయి, హనుమకొండ జిల్లా సోమిడికి చెందిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్ , సికింద్రాబాద్‌కు చెందిన వార్త శేఖర్ , హైదరాబాద్‌కు చెందిన నక్క సుశీల అలియాస్ రేల, సిద్దిపేట జిల్లా మిర్‌దొడ్డికి చెందిన రంగబోయిన భాగ్య, భద్రాది జిల్లా తడపలకు చెందిన కుంజం ఇడ్మల్ ఉన్నారు.

గణపతి లొంగుబాటుపై ఇప్పటికే తీవ్ర చర్చ..

దేశాన్ని మావోయిస్టు రహితంగా ప్రకటించాలన్నా...అదేవిధంగా తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా ప్రకటించాలన్నా.. అధికారిక రికార్డుల్లో ఉన్న మావోయిస్టులంతా అయితే లొంగిపోయారని, లేదంటే చనిపోయారని గుర్తించాల్సిందే. మావోయిస్టు అగ్రనేత, సుదీర్ఘ కాలం పాటు మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన నేత, తెలంగాణలో జగిత్యాల జిల్లా బీర్పూర్‌కు చెందిన కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటుపై ఇప్పుడు తీవ్రంగా చర్చ జరుగుతోంది.

తెలంగాణ పోలీసులతోపాటు కేంద్ర ఇంటెలిజెన్స్, ఇతర దర్యాప్తు విభాగాలు సైతం గణపతి జాడ కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అయితే ఇటీవల లొంగిపోయిన దేవ్‌జీ, రాజిరెడ్డి సహా కేంద్ర కమిటీ సభ్యుల స్థాయిలో పని చేసిన వారు కూడా తమకు గణపతి జాడ తెలియదని చెబుతున్న నేపథ్యంలో గణపతి లొంగుబాటు సాధ్యమా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మార్చి 31 తర్వాత పరిస్థితి ఏంటి?

సాయుధ పోలీసు బలగాల నుంచి ఎదురవుతున్న తీవ్రమైన దాడులను ఎదుర్కోలేక మావోయిస్టు అగ్ర నాయకత్వం సైతం అడవులు వీడి లొంగుబాట పడుతున్నా..ఇంకా వందల మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు తెలుస్తోంది. అజ్ఞాతం వీడేందుకు కొందరు అంగీకరించడం లేదు. అయితే మార్చి 31 తర్వాత మిగిలే మావోయిస్టులపట్ల కేంద్రం వైఖరి ఎలా ఉంటుందన్నది వేచి చూడాలి. లొంగకపోతే మార్చి 31 తర్వాత మావోయిస్టుల ఏరివేత తప్పద న్న సంకేతాలే పంపుతున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల కోసం మరోసారి గడువు పెంచుతారా..లేదా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు.

**నిషేధం ఎత్తివేత షరతు ఫలించేనా?**

తాము అజ్ఞాతం వీడి జనంలో జనం మధ్య, ప్రజల సమస్యలపై ప్రజాస్వామ్య విధానంలో పోరాటాలు చేస్తామని ఇప్పటికే లొంగిపోయిన ఎంతో మంది కేంద్ర కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. అయితే, మావోయిస్టు పార్టీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని వారు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మావోయిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేస్తే..అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులంతా ఆయుధాలు వీడి లొంగిపోయేలా తాము కృషి చేస్తామని చెబుతున్నారు.

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశంలోనూ మావోయిస్టు మాజీ కీలక నేతలు ప్రతిపాదించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇదే విషయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఢిల్లీలో స్వయంగా కలిసి చెప్పారు. అయితే, ఇప్పటివరకు ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

# సిట్‌కు చిక్కిన డ్రగ్ పెడ్లర్



ఈ కబురు హైదరాబాద్:మొయినాబాద్, శంషాబాద్ రూరల్: ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో కీలక నిందితుడు సిట్ అధికారులకు చిక్కాడు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి డ్రైవర్‌కు డ్రగ్స్ సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డ్రగ్ పెడ్లర్ అభిషేక్‌సింగ్‌ను శనివారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ కోసం డ్రగ్స్ సరఫరా చేసినట్లు తేలింది. ఇతని ద్వారా డ్రగ్స్ మూలాలను గుర్తించడంపై సిట్ ప్రత్యేక దృష్టి సారించింది. అభిషేక్ నుంచి రోహిత్‌రెడ్డి బృందం సుమారు 24 సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు సమాచారం.

లింక్‌లపై ఆరా..

అభిషేక్‌సింగ్ పోలీసులకు చిక్కడంతో అతని నుంచి డ్రగ్స్ ఎవరెవరు, ఎప్పుడెప్పుడు కొనుగోలు చేశారనే కోణంలో సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇతనితో కొనుగోలుదారులు జరిపిన ఆర్థిక లావాదేవీలు, ఫోన్ చాటింగ్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే 11 మందిపై కేసు నమోదు చేయగా.. రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మ జైలుకు వెళ్లారు. మిగతా వారిలో టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌తో పాటు మరో ఏడుగురికి బెయిల్ మంజూరైంది.

మహేశ్‌కుమార్ మినహా.. మిగిలిన వారంతా ఐదు రోజులుగా శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో సిట్ విచారణకు హాజరవుతున్నారు. కేసు దర్యాప్తుపై ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుదీర్‌బాబు ఎప్పటికప్పుడు కీలకమైన సూచనలు చేస్తున్నారు. ఆయన నిందితులను నేరుగా విచారించి పలు విషయాలు తెలుసుకుంటున్నారు. రిమాండ్‌లో ఉన్న ముగ్గురిని కస్టడీకి తీసుకుంటే ఈ కేసులో పురోగతి సాధించవచ్చని సిట్ అధికారులు భావిస్తున్నారు. కస్టడీ పిటిషన్‌పై తీర్పు సోమవారం వెలువడే అవకాశం ఉందని చెపుతున్నారు.

పోలీస్ పహారాలో ఫామ్‌హౌస్..

వివాదాలకు కేంద్ర బిందువైన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో పోలీస్ పహారా కొనసాగుతోంది. ఈ నెల 14న ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ సంచలనంగా మారిన విషయం తెలిసిందే. డ్రగ్స్ పార్టీని భగ్నం చేసేందుకు ఈగల్ టీం, స్థానిక పోలీసులు వెళ్లడంతో నాలుగు రౌండ్ల కాల్పులు జరిగాయి. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. పార్టీలో పాల్గొన్న నిందితులకు చెందిన ఆరు లగ్జరీ కార్లు ఫామ్‌హౌస్‌లోనే ఉన్నాయి.

ఆ రోజు నుంచి పోలీసులు ఫామ్‌హౌస్‌లో పహారా కాస్తూ.. బయటి వ్యక్తులను లోనికి రానివ్వడంలేదు. మరోవైపు అసైన్డ్ భూమిలో ఉన్న ఫామ్‌హౌస్‌ను సీజ్ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భూ రికార్డులను పరిశీలించిన అధికారులు న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం. అనుమతులు లేకుండా రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో చేపట్టిన నిర్మాణాలను కూల్చడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఇరాన్ వార్ వేళ మసకబారుతోన్న పసిడి..
# అసలు 1983లో ఏమైంది..?



పశ్చిమాసియాలో ఘర్షణలు రోజురోజుకూ తీవ్రం అవుతున్నాయి. అనిశ్చితుల నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారం ధర పెరుగుతుందని ఆశించినా.. అంచనాలకు భిన్నంగా భారీగా పడిపోతోంది. శనివారం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4500 డాలర్ల దిగువకు పడిపోయింది. 1983 తర్వాత ఒక వారంలో పసిడి ధర ఈ స్థాయిలో పతనమవడం మళ్లీ ఇప్పుడే. కమోడిటీ ఎక్స్ఛేంజ్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్సు బంగారం ఒక దశలో 2.47 శాతం మేర పతనమై రూ.4,492 వద్ద ట్రేడయింది. ఔన్సు వెండి 5 శాతం కుంగి, 70 డాలర్ల దిగువకు చేరింది. హైదరాబాద్‌లో శనివారం పది గ్రాముల మేలిమి బంగారం (Gold) 1,49,992గా ఉంది. కొన్ని నెలల క్రితం ఫ్యూచర్స్‌లో వెండి జీవనకాల గరిష్ఠాలకు చేరి, 119 డాలర్లు పలికిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిణామాలతో ఈ రెండు లోహాల ధరలు ఒత్తిడికి గురవుతున్నాయి. దాంతో రేట్లు పెరిగినా.. మదుపర్లు అందులో పెట్టుబడులు కొనసాగించలేక, తమ వాటాలను ఉపసంహరించుకుంటున్నారు.

983లో అసలేం జరిగింది..?

1979-1980 మధ్యలో బంగారం ధర భారీగా పెరిగింది. ఒక ఔన్సు ధర 850 డాలర్ల పైకి చేరింది. అప్పుడు కూడా ఇరాన్‌లో విప్లవం కారణంగా చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు అది ప్రచ్ఛన్న యుద్ధ సమయం. అంటే యూఎస్- యూఎస్ఎస్ఆర్ వంటి రెండు శక్తిమంతమైన దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగాయి. ఈ అనిశ్చితితో అప్పటివరకు కొన్నేళ్లపాటు పరుగులు పెట్టిన పుత్తడి బుడగ 1983లో పగిలిపోయింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే లక్ష్యంతో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను పెంచాలని నిర్ణయం తీసుకోవడం షాకిచ్చింది. అమెరికా డాలర్‌ను బలోపేతం చేసే చర్యగా దానిని భావించారు. దాంతో ఔన్సు పుత్తడి ధర 15-20 శాతం మేర పడిపోయి, 400 డాలర్ల దిగువకు చేరింది.

ప్రస్తుత ఘర్షణల వల్ల బ్యారెల్ ముడిచమురు దాదాపు 40 డాలర్ల వరకు పెరిగినా బంగారం ధర మాత్రం పెరగకపోగా.. మరింత తగ్గుతోంది. డాలర్‌కు గిరాకీ పెరగడం వల్ల, పెట్టుబడులు అటు మళ్లడమే ఈ పరిస్థితికి కారణమనే విశ్లేషణలు ఉన్నాయి. బ్యారెల్ చమురు ధర 200 డాలర్లకు చేరితే మాత్రం, బంగారం ప్రస్తుత స్థాయుల నుంచి 15-20% మేర పెరిగి ఔన్సు 5,400-6,000 డాలర్లు పలకొచ్చని అంచనాలున్నాయి. వెండి ఔన్సు ధర ప్రస్తుతం 76 డాలర్ల వద్ద ఉన్నా, ఇది 110-130 డాలర్లకు చేరొచ్చనీ పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా పలు అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటాయన్న సంగతి తెలిసిందే.

## ఆయిల్‌పై అమెరికా అంచనా..
# ఇరాన్ క్లారిటీ




మార్చి 20 నాటికి నౌకల్లో లోడ్ చేసిన ముడి చమురుపై అమెరికా ఇటీవల స్వల్పకాలిక ఆంక్షలను సడలించింది. ఏప్రిల్ 19 వరకు అమల్లో ఉండే ఈ మినహాయింపు ద్వారా సుమారు 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు మార్కెట్లోకి వస్తుందని, తద్వారా పెరుగుతున్న ధరలకు అడ్డుకట్ట వేయవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ విడుదల చేసిన ప్రకటన ఈ అంచనాలను తలకిందులు చేసింది. "ప్రస్తుతానికి అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేయడానికి ఇరాన్ వద్ద అదనపు ముడి చమురు లేదా మిగులు నిల్వలు లేవు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ వ్యాఖ్యలు కేవలం కొనుగోలుదారులలో భరోసా నింపడానికి, మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయడానికి చేసిన ప్రయత్నంలా కనిపిస్తున్నాయి."

**మంటలు పుట్టిస్తున్న ముడి చమురు ధరలు**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి గుండా సాగే రవాణాపై ఆందోళనల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 120 డాలర్ల మార్కును తాకింది. ఈ తరుణంలో ఇరాన్ నుండి అదనపు సరఫరా ఉండదని తెలియడంతో మార్కెట్ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## యాపిల్ ఎయిర్‌పాడ్స్ మ్యాక్స్2 లాంచ్: ధర ఎంతంటే?



డిసెంబర్ 2020లో యాపిల్ కంపెనీ ఒరిజినల్ ఎయిర్‌పాడ్స్ మ్యాక్స్ విడుదల చేసిన తరువాత.. ఇప్పుడు ఎయిర్‌పాడ్స్ మ్యాక్స్ 2ను పరిచయం చేసింది. ఈ కొత్త ప్రీమియం ఓవర్‌ఇయర్ హెడ్‌ఫోన్‌ల ధర భారతదేశంలో రూ. 67,900గా ఉంది. ఈ కొత్త హెడ్‌ఫోన్‌లు యాపిల్ హెచ్2 చిప్‌తో పనిచేస్తాయి. 'మునపటి తరంతో పోల్చితే 1.5 రెట్లు ఎక్కువ ప్రభావంతమైన యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ (ఏఎన్‌సి)ను అందిస్తుంది' అని కంపెనీ ప్రకటించింది. విమానం, రైలు శబ్దాల వంటి బాహ్య శబ్దాలను ఈ అప్‌గ్రేడ్ సమర్థవంతంగా నిరోధిస్తుంది.

ఈ హెడ్‌ఫోన్‌ల కోసం ప్రీఆర్డర్లు మార్చి 25న ప్రారంభమవుతాయి, కాగా డెలివరీలు ఏప్రిల్ ఆరంభంలో మొదలయ్యే అవకాశం ఉంది. కంపెనీ ఈ హెడ్‌ఫోన్‌లో అప్‌గ్రేడ్ మైక్రోఫోన్‌లు, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ వంటి వాటిని అప్డేట్ చేసింది. కాబట్టి ఇది వినియోగదారులకు మంచి అనుభూతిని అందిస్తుంది.యాపిల్ ఉత్పత్తులకు డిమాండ్భా రతదేశంలో యాపిల్ ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యువత, ప్రీమియం వినియోగదారుల మధ్య iPhone, MacBook, iPad వంటి పరికరాలు ప్రతిష్టాత్మక గుర్తుగా మారాయి. మెరుగైన కెమెరా నాణ్యత, సేఫ్టీ ఫీచర్స్, ఎకోసిస్టమ్ సమగ్రత వల్ల వినియోగదారులు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అంతే కాకుండా.. EMI ఆఫర్లు, ఆన్‌లైన్ విక్రయాలు.. భారతదేశంలో స్థానిక తయారీ పెరగడం వంటి అంశాలు కూడా యాపిల్ ఉత్పత్తుల చేరువను పెంచాయి.

# రూ. 10.69 లక్షలకే స్కోడా కుషాక్ ఫేస్‌లిఫ్ట్

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ స్కోడా ఆటో ఇండియా ఎస్‌యూవీ విభాగంలో కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను (skoda kushaq facelift) లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.10.69 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ నిర్ణయించింది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.18.99 లక్షలు (ఎక్స్ షోరూం)గా (skoda kushaq facelift price) కంపెనీ పేర్కొంది. క్లాసిక్+, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మాంటే కార్లే వంటి 5 వేరియంట్‌లలో ఈ మోడల్‌ను తీసుకొచ్చారు. మార్కెట్లో ఉన్న రెనో డస్టర్, హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనుంది. కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను కొత్తగా డిజైన్ చేశారు. స్కోడా కొడియాక్ మోడల్ తరహా గ్రిల్, డీఆర్ఎల్ఎస్ హెడ్‌లైట్స్‌తో పాటు స్కోడా బ్రాండ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్‌ను ఇచ్చారు. కారు లోపల యాంబియంట్ లైటింగ్, 2 స్పోక్ స్టీరింగ్ వీల్, 10.25 అంగుళాల డిజిటల్ కాక్‌పిట్‌తో పాటు ఏఐ అసిస్టెంట్‌తో కూడిన 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంది. ఈ సెగ్మెంట్‌లో మొదటి సారి వెనుక సీట్లో మసాజ్ ఫంక్షన్‌ను తీసుకొచ్చారు. పనరోమిక్ సన్‌రూఫ్, పవర్ అడ్జెస్టబుల్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్ స్టేషన్, ఆటోమెటిక్ క్లైమెట్ కంట్రోల్ ఫీచర్లను అమర్చారు. భద్రత కోసం ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, పార్కింగ్ కెమెరా, పార్కింగ్ సెన్సార్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో డిమ్మింగ్ ఇన్‌సైడ్ రియర్ వ్యూ మిర్రర్ ఇచ్చారు. ఈ మోడల్స్‌లో అడ్వాన్సడ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్, 360 డిగ్రీల కెమెరా లేకపోవడం గమనార్హం. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 6 స్పీడ్ మాన్యుల్ లేదా 8 స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమెటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 7 స్పీడ్ డీసీటీ ఆప్షన్లలో కారు లభిస్తుంది.






## రూ.47 లక్షల జాబ్ రిజెక్ట్ చేసిన టెకీ.. కారణం ఏమిటంటే!

పోటీ ప్రపంచంలో లక్షల జీతం లభించే జాబ్ వస్తే ఎవరు మాత్రం వద్దనుకుంటారు. కానీ.. తాను ఎంపికైన ఉద్యోగానికి కావలసిన నైపుణ్యం తన దగ్గర లేదని ఒక టెకీ రూ.47 లక్షల వేతనం లభించే ఉద్యోగాన్ని వదులుకున్నారు. దీనికి సంబందించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

వనేష్ మాలి అనే వ్యక్తి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన సమాచారం ప్రకారం.. తనకు పూణేలో ఒక మంచి కంపెనీలు సీనియర్ ఉద్యోగానికి రూ.47 లక్షల వేతనంతో జాబ్ ఆఫర్ వచ్చిందని పేర్కొన్నారు. ప్యాకేజీ బాగుంది, కంపెనీ కూడా గొప్పదే, కానీ ఆ పదవికి అవసరమైన నైపుణ్యాలు నాకు ఇంకా పూర్తిగా లేవని.. తాను ప్రస్తుతం ఆ స్థాయిలో పని చేయడానికి సిద్ధంగా లేనని, ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు వెల్లడించారు.

ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ఆ ఆఫర్‌ను అంగీకరించి, ఉద్యోగంలోనే అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాల్సిందని అన్నారు. కాగా మరికొందరు అతని నిజాయితీని ప్రశంసించారు. అలాంటి జాబ్ ఆఫర్ వదులుకోవడానికి ధైర్యం కావాలని మరికొందరు అన్నారు.

## ఎస్‌బీఐకి ఐటీ శాఖ భారీ ట్యాక్స్ నోటీసు..

దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)కు ఆదాయపు పన్ను శాఖ నుండి భారీ నోటీసు అందింది. వడ్డీతో కలిపి మొత్తం రూ. 6,337.5 కోట్ల మేర పన్ను చెల్లించాలని ఐటీ శాఖ డిమాండ్ నోటీసు జారీ చేసింది. శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత ఎస్‌బీఐ ఈ విషయాన్ని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది.

అసలు ఏం జరిగింది?

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 143(3), 144సి(3), 144బి కింద ఐటీ శాఖ మార్చి 19న ఈ ఉత్తర్వులను జారీ చేసింది. 2023-24 అసెస్‌మెంట్ సంవత్సరానికి (AY24) సంబంధించి నిర్వహించిన స్క్రూటినీ అసెస్‌మెంట్ ప్రక్రియలో భాగంగా ఈ పన్ను డిమాండ్ ఉత్పన్నమైందని బ్యాంక్ తెలిపింది. వివిధ అంశాల్లో ఆదాయపు పన్ను శాఖ చేసిన కోతలే (Disallowances) ఈ భారీ మొత్తానికి కారణమని తెలుస్తోంది.

సెబీ (SEBI) నిబంధనల ప్రకారం, కంపెనీ ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపే ఏవైనా ప్రధాన పరిణామాలు చోటుచేసుకుంటే వాటిని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించాల్సి ఉంటుంది. ఈ పన్ను డిమాండ్ మొత్తం 'మెటీరియాలిటీ థ్రెషోల్డ్' (నిర్ణీత పరిమితి) కంటే ఎక్కువగా ఉన్నందున, పారదర్శకత, కార్పొరేట్ గవర్నెన్స్‌లో భాగంగా ఎస్‌బీఐ ఈ వివరాలను బహిర్గతం చేసింది.

ఎస్‌బీఐ తదుపరి చర్యలు


ఈ నోటీసుపై ఎస్‌బీఐ ధీమాగా ఉంది. గడిచిన కొన్నేళ్లుగా ఇలాంటి అంశాలపైనే బ్యాంక్ న్యాయపోరాటం చేస్తోందని, తాజా నోటీసును కూడా అప్పీలేట్ అధికారుల ముందు సవాలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ పన్ను నోటీసు వల్ల బ్యాంక్ రోజువారీ కార్యకలాపాలు లేదా వ్యాపార నిర్వహణపై ఎటువంటి ప్రభావం ఉండదని ఎస్‌బీఐ యాజమాన్యం పెట్టుబడిదారులకు హామీ ఇచ్చింది.

## మరో రెండు కథలకు గ్రీన్ సిగ్నల్



కథానాయకుడు నితిన్ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. ప్రస్తుతం వీఐ ఆనంద్ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడిది ఇంకా పూర్తి కాకుండానే మరో రెండు ప్రాజెక్ట్‌ల్ని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 'ఆయ్' సినిమాతో తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు అంజి. ఇప్పుడాయన చెప్పిన ఓ కథకు నితిన్ పచ్చజెండా ఊపినట్లు సమాచారం. అంతేకాదు దీన్ని ఆయన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్‌లోనే నిర్మించనున్నట్లు తెలిసింది. ఇది సంక్రాంతి విడుదలే లక్ష్యంగా.. జులై నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే ఈలోగానే నితిన్ ఓ కొత్త దర్శకుడితో మరో చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ దీన్ని నిర్మించనుందని.. వచ్చే నెలలోనే ఇది లాంఛనంగా మొదలు కానుందని టాక్. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది.





## 4 గంటల సినిమా తీయాలంటే గట్స్ ఉండాలి: రాజమౌళి

రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన 'ధురంధర్ 2' (Dhurandhar 2) ఉగాది సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్, రామ్‌చరణ్, మహేష్‌బాబు, విజయ్ దేవరకొండ వంటి ప్రముఖ హీరోలు చిత్ర బృందాన్ని ప్రశంసిస్తున్నారు. తాజాగా దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి (SS Rajamouli) సోషల్ మీడియా వేదికగా 'ధురంధర్ 2' దర్శకుడు, హీరోని ప్రశంసిస్తూ, టీమ్‌ని అభినందిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ''ధురంధర్' నాకు బాగా నచ్చింది. దానికి సీక్వెల్‌గా వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్'లోనూ భావోద్వేగాల పరంగా ఏమాత్రం తగ్గలేదు. ఆదిత్యధర్ (dhurandhar director) నాలుగు గంటల పాటు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని తెరపై ఆవిష్కరించారు. ఇలాంటి సినిమా తీయాలంటే గట్స్ ఉండాలి. రచన, నటీనటులు, సాంకేతిక పరిజ్ఞానం, సంగీతం వేటిల్లోనూ లోపాలు కనిపించలేదు. చివరి ఫ్రేమ్ వరకూ ప్రేక్షకులు సీట్లకు అతుక్కుపోయేలా చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమాలో వచ్చే మలుపులు, భావోద్వేగాలను తెరపై చూపించడంలో దర్శకుడు విజయం సాధించారు. రణ్‌వీర్ (Ranveer Singh) తన నటనతో మంత్రముగ్ధుల్ని చేశారు. జస్కిరాత్ సింగ్, హమ్జా అలీ మజారీగా రెండు పాత్రలకూ న్యాయం చేశారు. షెడ్డులో బంధించిన సోదరిని కలిసే సమయంలో ఆయన నటన మాస్టర్‌క్లాస్. సినిమా మొదటినుంచి పతాక సన్నివేశం వరకు రణ్‌వీర్ నటన హృదయాన్ని మెలిపెట్టేలా ఉంది. దేశ నిస్సహాయతను, అసహనాన్ని మాధవన్ తెరపై చక్కగా ప్రదర్శించారు. ఈ విజయం మనందరిదీ'' అంటూ రాజమౌళి 'ధురంధర్ 2' చిత్రబృందాన్ని కొనియాడుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

### దర్శకులను సూపర్‌స్టార్లు తొక్కేస్తున్నారు...

## కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు

వివాదాస్పద అంశాలపై కూడా సూటిగా, స్పష్టంగా తన అభిప్రాయాలను వెల్లడించే నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్లు ఫిల్మ్‌మేకర్లను వేధిస్తారని, వారిని బెదిరింపులకు గురిచేస్తారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయంపై ఆమె గళం విప్పారు. హాలీవుడ్‌లో ప్రముఖ నటుల కంటే దర్శకులకే ఎక్కువ పేరు, గౌరవం ఉంటాయని, కానీ బాలీవుడ్‌లో పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల ఘన విజయం సాధించిన 'ధురంధర్ 2' చిత్రం సందర్భంగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ప్రశంసిస్తూ కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక సుదీర్ఘమైన నోట్ రాశారు. భారతీయ చిత్ర పరిశ్రమలో దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు తీవ్రమైన శ్రమకు గురవుతారని, కానీ వారికి సరైన పారితోషికం గానీ, గుర్తింపు గానీ లభించడం లేదని ఆమె పేర్కొన్నారు. "ధురంధర్ విజయంలో గొప్ప విషయం ఏమిటంటే, ఆదిత్య ధర్ ఒక సూపర్‌స్టార్ డైరెక్టర్‌గా స్థిరపడటం. స్పీల్‌బర్గ్, టరంటినో, నోలన్ వంటి హాలీవుడ్ సూపర్‌స్టార్ దర్శకులకు ఎప్పుడూ అక్కడి నటుల కన్నా అధిక ప్రాధాన్యత ఉంటుంది. కానీ మనం మన ఫిల్మ్‌మేకర్లకు తగినంత గౌరవం ఇవ్వం" అని కంగనా వ్యాఖ్యానించారు.

"దర్శకులు అధిక శ్రమకు గురవుతూ, తక్కువ వేతనం పొందుతూ సూపర్‌స్టార్ల చేతిలో వేధింపులకు గురవుతున్నారు. దీని ఫలితంగానే, ఫిల్మ్‌మేకర్ కావాలని లేదా సినిమాటోగ్రాఫర్ అవ్వాలని కలలు కనే యువతను నేను ఎప్పుడూ కలవలేదు. ప్రతి ఒక్కరూ తమకు టాలెంట్ ఉందని చెప్పకుంటారు, కానీ అందరూ నటులు కావాలనే కోరుకుంటారు. ఇక్కడ ఏ హీరో కన్నా ప్రకాశవంతంగా వెలిగిపోతున్న ఒక సూపర్‌స్టార్ ఫిల్మ్‌మేకర్ (ఆదిత్య ధర్) ఉన్నారు. ఇప్పుడు ఎందరో యువకులు ఆయన కథను చూసి, ఆయనలాగే ఎదగాలని ఆకాంక్షిస్తారు. సినీ పరిశ్రమను ఉన్నత శిఖరాలకు తీసుకెళతారు. ఆదిత్య ధర్... మీకు నా వందనాలు" అని కంగనా తన పోస్టులో రాసుకొచ్చారు.

ఈ పోస్టులో దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసల వర్షం కురిపించిన కంగనా, చిత్ర కథానాయకుడు రణ్‌వీర్ సింగ్‌ను గానీ, ఇతర నటీనటులను గానీ ట్యాగ్ చేయకపోవడం గమనార్హం.



## ఏ అమ్మాయి కూడా అలా చేయలేదేమో



శారీరకంగా ఎన్నో మార్పులు చేసుకున్నాను కాబట్టే.. పరిశ్రమలో తట్టుకొని నిలబడ్డానని అంటోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. ఈ మధ్యకాలంలో ప్రయోగాత్మక, శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తున్న నాయికీమె. ఇటీవలే 'దల్దాల్' సిరీస్‌తో ప్రేక్షకుల్ని అలరించిన ఈమె.. ఇక్కడ సినిమా పట్ల లోతైన అవగాహన లేకుండానే చాలా మంది విమర్శకులుగా మారారని చెప్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భూమి సోషల్ మీడియాలో ట్రోల్స్, తన సినీ కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

''దశాబ్ద కాలంగా చిత్రపరిశ్రమలో నా ప్రయాణం సాగుతోంది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నేను ఎంచుకున్న పాత్రల కోసం ఎన్నో శారీరక మార్పులకు లోనయ్యాను. దీని వల్ల చాలా నష్టాలు ఎదురయ్యాయి. ఏ అమ్మాయి కూడా అలా చేయలేదేమో. నేను ఎంపిక చేసుకున్న కథల్లో జీవించడానికి నిరంతరం మారుతూ వచ్చా. దీంతో పాటు రూ.300350 కోట్ల విలువైన భారీ బడ్జెట్ చిత్రాలతో సహా ఎన్నో ప్రాజెక్టులను తిరస్కరించా. ఎందుకంటే అవి నా ఆలోచనలకు అనుగుణంగా లేవు. భవిష్యత్తులో చిత్ర నిర్మాణంలోకి అడుగుపెట్టాలనుకుంటున్నా''.

**అదెంతవరకూ నిజమో తెలియదు**

''నేటి సినిమాల్లో విమర్శనాత్మక ఆలోచన ఎక్కువగా ఉందో లేదో నాకు తెలియదు కానీ సినిమాల గురించి మాట్లాడే విధానంలో, వాటిని విమర్శించే విధానంలో మాత్రం చాలా మార్పులు వచ్చాయి. ఇక్కడ ప్రతి ఒక్కరూ విమర్శకులే. సినిమా అనేది ఓ గొప్ప అధ్యయనం. మాకు సినిమా ప్రశంసను కూడా ఒక కోర్సులా నేర్పించారు. నా కెరీర్ తొలినాళ్లలో సమీక్షలు ప్రత్యేక అర్థాన్నిచ్చేవి. సమీక్షల కోసం ఎదురుచూసేదాన్ని. నేడు సినిమా విజయంలో ఎక్కువ భాగం శుక్రవారం మీదే ఆధారపడి ఉంటుంది. కానీ అదెంతవరకు నిజమో నాకు తెలియదు. మధ్యతరహా, చిన్న సినిమాలు ఎప్పుడూ నోటి మాట ద్వారానే విజయాన్ని అందుకుంటాయి. నా సినిమాలు కూడా ఆ కోవకు చెందినవే. రాజ్‌కుమార్ రావ్, ఆయుష్మాన్ ఖురానా.. ఇలా నాతో పాటు చాలా మంది నటీనటుల కెరీర్‌లు నోటి మాట ద్వారా హిట్ అయినా చిత్రాల వల్లే నిలిచాయి''.

**ఆమే నాకు స్ఫూర్తి**

''ప్రస్తుతం అన్ని రంగాల్లో కృతిమ మేధ (ఏఐ) కచ్చితంగా ఉంటుంది. అది అనివార్యంలా మారింది. అందుకే దాన్ని ప్రతిఘటించడానికి బదులుగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఒక సాధనంగా వినియోగించుకోవాలి. ఇలాంటి సాంకేతికత వల్ల నా ఆలోచనా విధానాల్లోనూ మార్పులు వచ్చాయి. స్క్రిప్ట్, పాత్రలు ఎంపికల్లో ఏఐని ఉపయోగించను కానీ.. ఆ పాత్ర లోతు తెలుసుకోవడానికి దీన్ని వినియోగిస్తా. నేను కథానాయిక ప్రియాంక చోప్రాకు అభిమానిని. ఎన్నో విషయాల్లో తనని స్ఫూర్తిగా తీసుకుంటా''.

**అదొక గుణపాఠం**

**"నా కెరీర్‌లోనే 'ది లేడీ కిల్లర్' చిత్ర వైఫల్యం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నన్ను తీవ్రంగా దెబ్బతీసింది. ఇక నా పనైపోయిందనుకున్నా. మొదట నాకు ఇచ్చిన స్క్రిప్ట్ పరిపూర్ణంగానే ఉంది. కానీ అందులో చాలా భాగాన్ని తెరకెక్కించలేదు. అసంపూర్తిగా సినిమాను విడుదల చేశారు. ఇది నాకు ముందే తెలిసుంటే బాగుండేది. నేను కూడా మేకింగ్‌లో భాగమై ఉంటే కొన్ని విషయాల్ని మార్చగలిగేదాన్ని. అయినా జరిగినదానికి నేను చాలా ఆశ్చర్యపోయా. ఎందుకంటే గతంలో ఎప్పుడూ అలా జరగలేదు. ఈ సినిమా పరిస్థితి ఏంటా అని భయపడ్డాను. చివరకు ఇదొక గుణపాఠంలా భావించి నాకు నేను సర్దిచెప్పకున్నా".**

### సందీప్ కిషన్‌తో 'శంబాల'

## మేకర్స్ పాన్ ఇండియా మూవీ






ఆది సాయికుమార్ కథానాయకుడిగా యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన బ్లాక్ బస్టర్ చిత్రం 'శంబాల'. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న ఈ మూవీ ఆది కెరీర్‌లో మర్చిపోలేని హిట్ ఇచ్చింది. ఇప్పుడు దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. 'శంబాల' తరువాత దర్శక, నిర్మాతలు కలిసి చేస్తున్న ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ పోస్టర్‌ను పంచుకున్నారు. యుద్ధభూమి నేపథ్యంలో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రాన్ని పాన్‌ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు 2026లో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

## అల్లు అర్జున్.. కొత్త సినిమాల సంగతులు చాలానే!

అల్లు అర్జున్ చేయనున్న సినిమాలపై ఎప్పటికప్పుడు స్పష్టత వస్తున్నప్పటికీ... ఆ సినిమాల వెనక సంగతులు మాత్రం అభిమానుల్ని ఊరిస్తున్నాయి. అల్లు అర్జున్ అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా పేరేమిటి? విడుదల ఎప్పుడు? అందులో లుక్, ఆ కథా ప్రపంచం ఎలా ఉంటుంది? అలాగే అల్లు అర్జున్ లోకేశ్ కనగరాజ్ కలయికలో సినిమా ఎప్పుడు మొదలవుతుంది? అందులో హీరోయిన్, ఇతర తారాగణం ఎవరు? ఇలా బోలెడన్ని సంగతులు తెలియాల్సి ఉంది. అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా పట్టాలెక్కి చాలా రోజులైనా, ఏ విషయం కూడా బయటకు రాకుండా అత్యంత గోప్యంగా ముంబయిలో చిత్రీకరణ జరుపుతున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమాని కూడా అధికారికంగా ప్రకటించినప్పటికీ, మిగతా విషయాలపై స్పష్టత ఇవ్వలేదు.

ఆ సంగతులన్నీ బయటకు రావడానికి తగిన సమయం రానే వచ్చింది. అల్లు అర్జున్ పుట్టినరోజు ఏప్రిల్ 8. ఆరోజే ఆయన, అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా లుక్‌ని విడుదల చేయనున్నారు. దాంతోపాటుగా సినిమా పేరు, విడుదల తేదీని కూడా ప్రకటించే అవకాశాలున్నట్టు సమాచారం. ఇప్పటికే అందుకు సంబంధించిన కసరత్తులో చిత్రబృందం నిమగ్నమైనట్టు తెలుస్తోంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రారంభ విశేషాలు కూడా ఆరోజే అని సమాచారం. వీటితోపాటు కొత్త సినిమాలపై



కూడా స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని, రెండు మూడు రోజులపాటు అల్లు అర్జున్ సినిమాల విశేషాల సందడి కొనసాగే అవకాశం ఉందని తెలిసింది.

# అయోధ్య రాముడి సేవలో లక్నో జట్టు



ఐపీఎల్ 2026 సీజన్‌కు మరో వారం రోజులు మాత్రమే మిగిలిఉంది. దీంతో ఆయా జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో చెమటోడుస్తున్నారు. రిషబ్ పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌లో సరికొత్త జెర్సీతో బరిలోకి దిగనుంది. ఈ నేపథ్యంలో టోర్నీ సన్నద్ధతకు ముందు అయోధ్యలోని రామజన్మ భూమిని దర్శించుకుంది.

శనివారం కెప్టెన్ రిషభ్ పంత్, ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా సహా క్రికెటర్లు అయోధ్య బాలరాముడి దీవెనలు అందుకున్నారు. ఐపీఎల్ 19వ సీజన్ ఘనంగా ఆరంభించాలని రాముడిని కోరుకుంటున్నట్లు లక్నో ఫ్రాంచైజీ తెలిపింది.ఈ సందర్భంగా శనివారం తమ టీమ్ అయోధ్య రాముడిని దర్శించుకున్న ఫోటోలను లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో పంచుకుంది.

'రాముడికి ప్రార్థనలు చేయడం కొత్తమే కాదు. ఐపీఎల్ కొత్త సీజన్ ప్రారంభం కాబోతున్న వేళ.. మా జట్టు ఆటగాళ్లందరు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆ రాముడి ఆశీర్వాదం ఉంటే అన్నీ అనుకూలంగా జరుగుతాయి' అని సంజీవ్ గొయెంకా ఏఎన్ఐతో తెలిపాడు.

ఐపీఎల్‌లో మూడుసార్లు ప్లే ఆఫ్స్ వరకూ పరిమితమైన లక్నో సూపర్ జెయింట్స్ గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచింది. రిషభ్ పంత్ కెప్టెన్సీలో ఆరే విజయాలతో నాకౌట్‌కు ముందే నిష్క్రమించింది. అయితే.. ఈసారి కొత్త జెర్సీతో ఆడనున్న లక్నో మైదానంలో చెలరేగిపోవాలనుకుంటోంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఏప్రిల్ 11న మ్యాచ్‌తో లక్నో టోర్నీలో అడుగు పెట్టనుంది.

# 'ఐసీసీ మా యాజమాని కాదు'



బంగ్లాదేశ్‌లో ఇటీవలే ఎన్నికైన కొత్త క్రికెట్ బోర్డు తమ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌తో అనధికారిక చర్చలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియను పరిశీలించడానికి విచారణ కమిటీ ఏర్పాటుకు సంబంధించి జాతీయ క్రీడా మండలి (ఎన్ఎస్సీ) ఐసీసీని ఆశ్రయిస్తూ గెజిట్‌ను విడుదల చేయడం తమను ఆశ్చర్యపరిచిందని బీసీబీ పేర్కొంది.

ఈ గెజిట్ ఎన్నికైన పరిపాలన స్థిరత్వం, స్వాతంత్ర్యం, కొనసాగింపు విషయంలో అనిశ్చితి సృష్టించే అవకాశముందని తెలిపింది. ఇదే విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అష్రఫుల్ హక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'బీసీబీ దేశ క్రీడామండలి పరిధిలో ఉందని, ఏమైనా అభ్యంతరాలుంటే బీసీబీకి చెప్పుకోవచ్చు.

కానీ ప్రస్తుత బోర్డు మాత్రం ఐసీసీకి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా అనిపించింది. బంగ్లా క్రికెట్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ఐసీసీ మా యాజమాని కాదు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)లో మాకు సభ్యత్వమున్నప్పటికీ తొలి ప్రాధాన్యత మాత్రం నేషనల్ స్పోర్ట్స్ పాలసీ (ఎన్ఎస్సీ)దే. బీసీబీ రాజ్యాంగం మేరకు ఆ దేశ క్రికెట్ బోర్డు అంతర్గత వ్యవహారాల్లో ఐసీసీ జోక్యం చేసుకోకూడదని స్పష్టంగా ఉంది.

అయితే ఐసీసీ మాకు సహాయకులు, మంచి మిత్రులు' అని చెప్పుకొచ్చాడు. అంతకముందు బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల కారణంగా కేకేఆర్ ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి రిలీజ్ చేయడం కూడా బంగ్లా క్రికెట్ బోర్డుకు రుచించలేదు. ఆ తర్వాత టీ20 ప్రపంచకప్ సమయంలో భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరించడంతో, వేదికలు మార్చే ప్రసక్తే లేదని ఐసీసీ తేల్చిచెప్పింది. దీంతో బంగ్లా టోర్నీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

# నా రాజీనామాకు..

## జై షాతో సంబంధమే లేదు: శివరామకృష్ణన్



నన్ను బీసీసీఐ గత 23 ఏళ్లుగా విస్మరించింది. అందుకే, కామెంటేటర్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నా''.. ఇదీ మాజీ క్రికెటర్ శివరామకృష్ణన్ నిన్న చేసిన వ్యాఖ్యలు. దీంతో అతడిని పక్కనపెట్టడం వెనుక బీసీసీఐ కార్యదర్శిగా వ్యవహరించిన జైషా ఉన్నారని సోషల్ మీడియా వేదికగా విమర్శలు వచ్చాయి. ఇప్పుడు వాటన్నింటినీ తోసిపుచ్చుతూ శివరామకృష్ణన్ మరో పోస్టు పెట్టారు. దీని వెనుక బీసీసీఐకి చెందిన ఓ ఉద్యోగి ఉన్నాడని.. మిగతా అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

''నా రాజీనామా చిత్రంలోకి బీసీసీఐ అడ్మినిస్ట్రేషన్‌ను తీసుకురావొద్దు. బీసీసీఐలోని ఒకే ఒక్క ఉద్యోగి చేసిన నిర్వాకం ఇది. జైషాతోపాటు ఇతర పెద్దలకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు. నా జీవిత పగ్గాలను నా చేతిలోకి తీసుకుంటున్నా. అలా చేసే హక్కు ఉందని భావిస్తున్నా'' అని వెల్లడించారు.

శివరామకృష్ణన్ 2000 నుంచి కామెంట్రీ చేయడం మొదలుపెట్టారు. ఐసీసీ క్రికెట్ కమిటీలోనూ ప్రతినిధిగా వ్యవహరించిన అనుభవం ఉంది. అయితే టాస్‌తోపాటు అవార్డుల ప్రజెంటేషన్ కార్యక్రమాల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీసీసీఐ తనను 23 ఏళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురి చేసిందని విమర్శించారు. ఇప్పుడు తాజా కామెంట్లతో భవిష్యత్తులో ఎలాంటి పాత్ర పోషిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# ఐపీఎల్.. ఈ 'కీలక' ప్లేయర్లను మిస్ అవుతాం!

**మరికొద్ది రోజుల్లోనే ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే పది ఫ్రాంచైజీలు సమాయత్తమవుతున్నాయి. అయితే, కొన్ని జట్లకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. కీలక ఆటగాళ్లలో కొందరు కొన్ని మ్యాచులకు దూరం కానుండగా.. మరికొందరు పూర్తిగా టోర్నీ నుంచే నిష్క్రమించిన పరిస్థితి. మరి ఇప్పటివరకు దూరం కానున్న కీలకమైన ప్లేయర్లు ఎవరో ఓ లుక్కేద్దాం..!**




పాట్ కమిన్స్: సన్‌రైజర్స్ హైదరాబాద్ సారథిగా ఉన్న పాట్ కమిన్స్ గాయం కారణంగా కొన్ని మ్యాచులకు దూరమయ్యాడు. స్ట్రైక్ బౌలర్ అయిన కమిన్స్ లేకపోవడం ఎస్ఆర్‌హెచ్‌కు నష్టమే. వెన్ను నొప్పి కారణంగా అతడు టీ20 ప్రపంచ కప్‌లోనూ ఆడని సంగతి తెలిసిందే. కమిన్స్‌కు బదులు ఇషాన్‌కు ఫ్రాంచైజీ నాయకత్వం బాధ్యతలు అప్పగించింది.

జోష్ హేజిల్‌వుడ్: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో కీలక బౌలర్. ఆసీస్‌కు చెందిన జోష్ హేజిల్‌వుడ్ కూడా గత పొట్టి కప్‌లో ఆడలేకపోయాడు. పవర్ ప్లే, డెత్ ఓవర్లలో వికెట్లు తీసే సత్తా అతడి సొంతం. కుడి మడమ వద్ద గాయం కారణంగా ఇబ్బంది పడ్డాడు. అయితే, ఎన్ని మ్యాచులకు దూరంగా ఉంటాడో తెలియదు.

హర్షిత్ రాణా: కోల్‌కతా నైట్ రైడర్స్‌కు పెద్ద ఎదురు దెబ్బ. పేస్ ఆల్‌రౌండర్‌గా హర్షిత్ రాణా కీలక ఆటగాడు. అయితే, టీ20 ప్రపంచ కప్ ముందు మోకాలి గాయం కారణంగా ఆటకు దూరమయ్యాడు. ఇప్పుడు ఐపీఎల్ సమయానికీ అతడు కోలుకోవడం కష్టమని భావించిన మేనేజ్‌మెంట్.. అతడు లీగ్ నుంచి పూర్తిగా నిష్క్రమించాడని పేర్కొంది.

మతీశా పతిరన: ఇప్పటికే హర్షిత్ రాణా రూపంలో పేసర్ దూరమై కష్టాల్లో ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మరో షాక్. గత వేలంలో దక్కించుకున్న మతీశా పతిరన కూడా గాయం కారణంగా కొన్ని మ్యాచులకు దూరమవుతున్నాడు. గాయం మానినా.. ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. మేనేజ్‌మెంట్ మాత్రం పతిరన సిద్ధమని చెబుతున్నప్పటికీ.. ఆరంభ మ్యాచుల్లో ఆడే అవకాశాలు తక్కువే.

వనిందు హసరంగ: ఈ స్టార్ స్పిన్ ఆల్‌రౌండర్ కూడా ఎడమ కాలి మడమ గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున బరిలో దిగాలని భావించినా.. కొన్ని మ్యాచులకు దూరమయ్యే అవకాశాలే ఎక్కువ! భారత్ శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచ కప్‌లోనూ హసరంగ ఆడలేదు. మిడిల్ ఓవర్లలో కట్టుదిట్టంగా బంతులేసే అతడు.. లోయర్ ఆర్డర్‌లో భారీ హిట్టింగ్ చేయగలడు.

నాథన్ ఎలిస్: చెన్నై సూపర్ కింగ్స్ పేసర్ నాథన్ ఎలిస్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. తొడ కండర గాయంతో ఈ ఆస్ట్రేలియా బౌలర్.. లీగ్ నుంచి వైదొలిగినట్లు సీఎస్‌కే వెల్లడించింది. ఐపీఎల్‌లో ఇప్పటిదాకా 17 మ్యాచ్‌లు ఆడిన ఎలిస్.. 19 వికెట్లు పడగొట్టాడు. 2025 వేలంలో సీఎస్‌కే రూ.2 కోట్లతో ఈ పేసర్‌ను దక్కించుకుంది. స్లో బంతులతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేయడం ఎలిస్ ప్రత్యేకత.

# ఒక్క క్షణం వృథా చేయొద్దు.. ఈసారి మరింత పోటీ: విరాట్ కోహ్లీ వార్నింగ్

**డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి కప్పును నెగ్గాలని చూస్తోంది. ఇప్పటికే స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సాధన మొదలుపెట్టేశాడు. అయితే, ఈసారి పోటీ తీవ్రంగా ఉంటుందని.. ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దని సహచరులను హెచ్చరించాడు. ఈ మేరకు తమ జట్టు ప్రాక్టీస్‌కు సంబంధించి ఆర్సీబీ ఓ వీడియో గ్లింప్స్‌ను షేర్ చేసింది. అందులో ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ జట్టులోకి వచ్చిన కొత్త ప్లేయర్లకు స్వాగతం పలికాడు. ఈ సందర్భంగా సీజన్‌లో ఎలాంటి పోటీ ఉంటుందో విరాట్ కోహ్లీ ఉద్బోధించాడు.**

**"గత మూడు సీజన్లలో మన కుర్రాళ్లు చాలా కష్టపడ్డారు. గతేడాది మనం ఛాంపియన్‌లుగా నిలిచాం. అయితే, ఈసారి మరింత పోటీ ఉండబోతోంది. ఇతర జట్లు కూడా బలంగా ఉన్నాయి. మనకున్న ఈ కొన్ని రోజుల్లో ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దు. మనమే ముందుండాలి. ఈ రెండున్నర నెలలు 120 శాతం శ్రమిద్దాం. సవాళ్లను ఎదుర్కొనేందుకు మీరంతా సిద్ధంగా ఉన్నారని మిమ్మల్ని చూస్తుంటేనే అర్థమవుతోంది" అని విరాట్ కోహ్లీ అన్నాడు.**



మనం స్క్వాడ్‌ను బలోపేతం చేశాం: ఆండీ

''కొత్త సీజన్ ప్రారంభానికి ముందు జట్టుతో కలిసిన ప్లేయర్లకు స్వాగతం. ఇటీవల అండర్ 19 వరల్డ్ కప్‌ను నెగ్గిన భారత జట్టులో సభ్యులు కనిష్క్, విహాన్‌కు శుభాకాంక్షలు. గత వేలం చాలా ఆసక్తికరంగా మారింది. మన స్క్వాడ్‌ను చాలా బలంగా మార్చుకున్నాం. నాణ్యమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాం. ఈ సీజన్‌లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తామని ఆశిస్తున్నా'' అని ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ వెల్లడించాడు.

మళ్లీ ఆర్సీబీదే టైటిల్: అశ్విన్

''ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గడం ఏ జట్టుకైనా సులువేం కాదు. ఇప్పుడున్న స్క్వాడ్‌తోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండోసారి విజేతగా నిలుస్తుందని భావిస్తున్నా. జట్టు పునర్నిర్మాణంలో ఆర్సీబీ చాలా తెలివిగా వ్యవహరించింది. హేజిల్ వుడ్ అందుబాటులోకి వచ్చి.. ఫిల్ సాల్ట్ ఫామ్ అందుకొంటే ఆర్సీబీకి తిరుగుండదు'' అని మాజీ క్రికెటర్ అశ్విన్ వ్యాఖ్యనించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ తన తొలి మ్యాచ్‌ను మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది.



# అంచనాలు అందుకుంటాం!

ఐపీఎల్ 2026 సీజన్‌లో టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా పంజాబ్ కింగ్స్ బరిలోకి దిగుతోంది. పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రధాన బలం. గతేడాది సీజన్‌లో కెప్టెన్‌గా అయ్యర్ పంజాబ్‌ను ఫైనల్ చేర్చాడు. కానీ తుది పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడిపోయి రన్నరప్‌కే పరిమితమయింది. కానీ ఈసారి మాత్రం అభిమానులు తమపై పెట్టుకున్న అంచనాలను నిజం చేస్తూ ఐపీఎల్ కప్పు కొల్లగొడతామని శ్రేయస్ అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 19వ సీజన్‌కు సిద్ధమవుతున్న తరుణంలో అయ్యర్ పలు ఆసక్తికర అంశాలను పంచుకున్నాడు.'గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గాను.

దాని నుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైనది. అయితే రెండు నెలల తీవ్రంగా కష్టపడిన తర్వాత ఇప్పుడు శరీరాకృతి బాగుంది. కానీ ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకు ఆడిన రోజులు ఉన్నాయి. గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం.

# 19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్ కు భారత్.. ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్



**ఐర్లాండ్‌తో టీమ్ఇండియా రెండు టీ20ల సిరీస్‌లలో తలపడనుంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్ మైదానంలో భారత జట్టు మ్యాచులు ఆడనుండటం గమనార్హం. ఇంగ్లాండ్ పర్యటనకు ముందే ఐర్లాండ్‌తో టీమ్ఇండియా ఈ సిరీస్‌ను ఆడనుంది. టీ20 ప్రపంచ కప్, ఐపీఎల్ తర్వాత భారత్ తొలి విదేశీ పర్యటనకు ఐర్లాండ్ వెళ్లనుంది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లను ఆడనుంది.**

## మ్యాచులు ఎప్పుడంటే?

**తొలి టీ20 మ్యాచ్: జూన్ 26న**

**రెండో టీ20 మ్యాచ్: జూన్ 28న**

**"టీమ్ఇండియా సీనియర్ జట్టు రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్‌కు వెళ్లనుంది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు అక్కడికి పర్యటించింది. 2018, 2022, 2023లో ఐర్లాండ్‌తో మ్యాచులు ఆడింది. అయితే, 2007 తర్వాత బెల్‌ఫాస్ట్ వేదికగా ఇప్పుడే మ్యాచ్‌లను ఆడనుంది" అని బీసీసీఐ వెల్లడించింది. ఐపీఎల్ ముగిశాక.. భారత్ స్వదేశంలోనే అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది.**